క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసి ఉన్న శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు తెల్లవారుజాము నుంచే ప్రారంభమయ్యాయి. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పోలేరమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు

పోరుమామిళ్ల : పట్టణంలోని కోటపోలేరమ్మ తిరునాల రెండవ రోజు తెల్లారకముందే భక్తులు అమ్మవారి దర్శనానికి గుడి ముందు బారులు తీరారు. మహిళలు చల్లన్నంతో వచ్చారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి, టెంకాయ కొట్టి పోలేరమ్మకు అర్చన చేయించారు. సీఐ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పోలేరమ్మకు ప్రత్యేక పూజలు చేయించారు. మధ్యాహ్నం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి ఏకాంబర భజన నిర్వహించారు.

ఘనంగా అమ్మవారిశాల వార్షికోత్సవం

దువ్వూరు : మండల కేంద్రంలోని శ్రీ మత్కన్యకా పరమేశ్వరి ఆలయ 6వ వార్షికోత్సవాన్ని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పూలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని కాయాకర్పూరం సమర్పించి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

ప్రశాంత జీవనంతోనే కుటుంబాల అభివృద్ధి

పోరుమామిళ్ల: అసాంఘిక కార్యక్రమాలు, రౌడీయిజం, గొడవలతో సమాజంలో అశాంతి తలెత్తుతుందని, కేసులు, కోర్టులతో కుటుంబం నాశనమవుతుందని సీఐ సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పుల్లివీడులో పోలీసు బృందంతో ఆయన నాకాబందీ నిర్వహించారు. పుల్లివీడు ఊరు చుట్టూ కంపచెట్లు, వామి దొడ్లల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులను సమావేశపరచి ప్రశాంతంగా జీవించాలని, ఎలాంటి అల్లర్లకు పాల్పడవద్దని సూచించారు. శాంతియుత జీవనంలో కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు.

సకాలంలో టీకాలు వేయాలి

అట్లూరు : గర్భిణులు, చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాలు నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్. మల్లేశ్వరి పేర్కొన్నారు. మండల పరిధిలోని అట్లూరు, కొండూరు, ఎస్ వెంకటాపురం, సోమేశ్వరపురం సచివాలయాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. అలాగే టీకాలు వేసే విధానం, ఏఎన్‌ఎంల రికార్డులు ఆమె పరిశీలించారు. అనంతరం గర్భిణులకు పరీక్షలు నిర్వహించి టీకాలు సకాలంలో వేస్తున్నారా? లేదా అని ఆరాతీశారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ హమీదాబేగం, డాక్టర్ విశ్వత్, సీహెచ్‌ఓ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రూ.2లక్షలు ఆర్థిక సహాయం



రూ.2లక్షల చెక్కును అందిస్తున్న సత్యనారాయణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కృపానగర్‌కు చెందిన పాలగిరి రవి కుమారుడు అజయ్ కుమార్ విద్యుత్ ప్రమాదంలో కొద్దిరోజుల క్రితం గాయపడ్డాడు. ఆపరేషన్ నిమిత్తం రూ.రెండు లక్షలు అవసరమవగా ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణను అజయ్ కుమార్ కుటుంబ సభ్యులు సంప్రదించారు. ఆయన తన చిన్ననాటి మిత్రుడు ముత్యాలపాటి విశ్వనాథ్ ద్వారా రూ.2లక్షల చెక్కును బాలుని కుటుంబ సభ్యులకు శనివారం అందచేశారు. ఆర్థిక సహాయం అందచేసిన విశ్వనాథ్‌కు బాలుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలకు మొల్ల స్ఫూర్తి

గోపవరం : మహాకవయిత్రి మొల్లమాంబ మహిళలకే స్ఫూర్తిదాయకమని సాహితీవేత్త బ్రహ్మశ్రీ సిద్దవటం సత్యనారాయణశర్మ అన్నారు. మొల్ల జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం మొల్ల సాహితీపీఠం కార్యాలయంలో మహిళా స్ఫూర్తి మొల్ల అనే అంశంపై సాహితీ ప్రియులతో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక మహిళలకు స్ఫూర్తిగా నిలిచిన మహోన్నత విదుషీమణి మహాకవయిత్రి మొల్ల అని కొనియాడారు. సభాధ్యక్షుడు, సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ మొల్ల రచించిన రామాయణంలో సీత పాత్ర ద్వారా మహిళా ఔన్నత్యానికి పెద్దపీట వేశారన్నారు. అనంతరం సిద్దవటం సత్యనారాయణశర్మను శాలువా, నగదు పారితోషికం, మొల్ల రామాయణ పుస్తక ప్రసాదంతో సత్కరించారు. కార్యక్రమంలో పీఠం కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, పార్వతి, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



శ్రీచైతన్య హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ఓటు వేయాలని కోరుతున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి రాజారాంరెడ్డి

ప్రొద్దుటూరు : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. శనివారం దొరసానిపల్లెలోని జిల్లా పరిషత్ హైస్కూల్, ఖాదర్ హుసేన్ మసీదు వీధిలోని మున్సిపల్ ఉర్దూ హైస్కూల్, ఇస్లామిక్ హైస్కూల్, శ్రీచైతన్య హైస్కూల్‌లో ఎమ్మెల్యే ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న అమ్మ ఒడి పథకం అందుతోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం విద్యారంగానికి ఇంత ప్రాధాన్యత ఇవ్వలేదని చెప్పారు. వెన్నపూస గోపాల్ రెడ్డి గతంలో ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ ఉమ్మడి రాష్ట్రానికి సంబంధించి అధ్యక్షుడిగా పనిచేశారని, గడిచిన ఎన్నికల్లో ఆయన్ను పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించారన్నారు. అదే స్ఫూర్తితో ఆయన కుమారుడైన వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపిస్తే సమస్యలను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ప్రైవేటు రంగ పాఠశాలలకు సంబంధించి గత 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్న ఎంవీ రామచంద్రారెడ్డిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, దొరసానిపల్లె సర్పంచ్ అరవ ఈశ్వరమ్మ మునివర, ఉపసర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీటీసీ మేరి సుప్రియ, వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్ల దాదాపీర్, పునరుద్రారెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు ఎంవీ రామచంద్రారెడ్డి, వెన్నపూస రవీంద్రారెడ్డిలను గెలిపించాలని శనివారం కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శిచంద్రారెడ్డి ప్రచారం చేశారు. ఖాదర్‌బాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఆదివారం శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో జరగనున్న సమావేశంలో పాల్గొనాలని కోరారు. వార్డు మెంబర్ మోషె, యువ నాయకుడు కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

గోపవరం: పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులను మంచి మెజార్టీతో గెలిపించాలని మండల సచివాలయ కన్వీనర్ దాసరిపుల్లయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని రాచాయపేట, బ్రాహ్మణపల్లె సచివాలయాల పరిధిలో ఎమ్మెల్సీ అభ్యర్థుల తరఫున గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయులను కలిసి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బలపరిచిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూసరవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

ప్రొద్దుటూరు : ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డిలను గెలిపించాలని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి రాజారాంరెడ్డి తెలిపారు. శనివారం రాయలసీమ వ్యాయామ విద్య కళాశాల అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆదివారం జరిగే ఆత్మీయ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

కౌన్సిలర్ల విస్తృత ప్రచారం

ప్రొద్దుటూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డిలను గెలిపించాలని కోరుతూ మున్సిపల్ కౌన్సిలర్లు పట్టణంలో శనివారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆదేశాల మేరకు ఆయా మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు తమ వార్డుల పరిధిలో ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తోపాటు అన్ని వార్డుల్లో ప్రచార కార్యక్రమం జరిగింది. ప్రతి పాఠశాలతోపాటు వార్డు పరిధిలోని పట్టభద్రులను గుర్తించి కౌన్సిలర్లు ఓటర్లను కలిసి కరపత్రాలు అందించి, ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

రేపు అయ్యవారిపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'

చాపాడు : మండలంలోని అయ్యవారిపల్లె గ్రామంలోని గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి శ్రీవాణి తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటలకు నుంచి మధ్యాహ్నం వరకూ వైద్య సేవలను అందించి, మధ్యాహ్నం నుంచి ఇళ్లలో ఉండే దీర్ఘకాలిక రోగులను పరీక్షించి అవసరమైన మందులను పంపిణీ అందజేస్తామని వైద్యాధికారి తెలియజేశారు.

మహిళలు చట్టాలను ఉపయోగించుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి రత్నప్రసాద్

ప్రొద్దుటూరు క్రైం : మహిళల కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకొని రక్షణ పొందాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కే.రత్నప్రసాద్ తెలిపారు. జాతీయ మహిళాదినోత్సవ వారోత్సవాల సందర్భంగా శనివారం పెద్దశెట్టిపల్లెలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజీలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన న్యాయమూర్తులు కే రత్నప్రసాద్, అనిల్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో చట్టాలను ప్రవేశపెట్టిందన్నారు. సూటి పోటి మాటలు అనడం, అవమానించడం లాంటివి, మానసిక హింస తదితర చట్టాల గురించి వివరించారు, న్యాయవాదులు లక్ష్మీప్రసన్న, కొండారెడ్డి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ జి గోవర్ధన్, న్యాయవాదులు లత, నిర్మలాదేవి, బాలాజీ పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జడ్జి

ఖాజీపేట : మహిళలు తమ హక్కుల గురించి పూర్తిగా తెలుసుకోవాలని అప్పుడే వారి సమస్యలు కష్టాలపై న్యాయపరమైన పోరాటం చేయగలరని మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి ఖాజా మొయినుద్దీన్ అన్నారు. నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా ఖాజీపేటలోని మోడల్ స్కూల్ మహిళల న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా వచ్చారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉన్న చట్టపరమైన హక్కులు, వివాహం అయిన తరువాత వారికి కలిగే హక్కులు, ఆస్తి మీద మహిళలకు లభించే హక్కులు, అలాగే కిడ్నాప్, రేప్, సెక్సువల్, గృహ హింస తదితర అంశాలపై వారికి వివరించారు. దీని వల్ల ప్రజలుల్లో చట్టాల పై మరింత అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ చారీ, నారాయణరెడ్డి, అబ్దుల్లా, కరీముల్లాతోపాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

నేషనల్ లైన్‌మెన్ దివస్ ర్యాలీ



మాట్లాడుతున్న విద్యుత్ ఉద్యోగులు

ప్రొద్దుటూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేషనల్ లైన్‌మెన్ దివస్ కొత్తగా ప్రకటించడంతో శనివారం ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని లైన్‌మెన్లు, ఇతర విద్యుత్ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ డివిజన్ కార్యాలయం నుంచి పుట్టపర్తి సర్కిల్ వరకు జరిగిన ఈ ర్యాలీని ఈఈ జి.శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగులు మాట్లాడుతూ లైన్‌మెన్ల దినోత్సవాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఇన్ని రోజులకు తమ శ్రమను ప్రభుత్వాలు గుర్తించాయన్నారు. డీఈఈ ప్రతాప్‌రెడ్డి, ఏఈలు లక్ష్మీనారాయణ, ప్రియదర్శన్‌రెడ్డి, ఏఏఓ భాను, జేఏఓ బర్నబాస్, యూనియన్ నాయకులు మాధవ, చక్రనాయక్, రమేష్, సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మెన్ల సేవలు వెలకట్టలేనివి

బద్వేలు అర్బన్ : విధినిర్వహణలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న లైన్‌మెన్ల సేవలు వెలకట్టలేనివని ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ ఐ.రవిచంద్రశేఖర్ పేర్కొన్నారు. జాతీయ లైన్‌మెన్ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక మైదుకూరురోడ్డులోని విద్యుత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు పగలనక, రాత్రనక శ్రమిస్తున్న లైన్‌మెన్ల సేవలను ప్రతిఒక్కరు గౌరవించాలని తెలిపారు. అనంతరం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన లైన్‌మెన్లకు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. అలాగే విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన లైన్‌మెన్లకు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈలు విజయకుమార్, చిన్నయ్య, రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం



రాజుపాళెం : కొర్రపాడులో హెచ్‌ఎం నాగేశ్వరికి కరపత్రాన్ని అందజేస్తున్న సూర్యనారాయణరెడ్డి

రాజుపాళెం : ప్రొద్దుటూరులోని శ్రీదేవి కల్యాణమండపంలో ఆదివారం జరగబోవు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశానికి రావాలని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఉపాధ్యాయులను కోరారు. అంతకుముందు కొర్రపాడులో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ దొంతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ వెలవలి శేఖర్‌రెడ్డి, తొండలదిన్నె వైస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి, టంగుటూరులో ముడియం గౌతమ్ రెడ్డి, గాదెగూడూరులో పోలా వెంకటరెడ్డి, వెల్లాల బాలికల గురుకుల పాఠశాలలో గోపాయపల్లె సర్పంచ్ జీరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, కానాల బలరామిరెడ్డి, పర్లపాడులో కసిరెడ్డి మధుసూదన్ రెడ్డి, బుక్కసముద్రం జగదీశ్వరరెడ్డి, అర్కటవేములలో ఎంపీటీసీ సభ్యుడు పాతపాటి శివనాగిరెడ్డి, సిద్ది రమణారెడ్డి, రాజుపాళెంలో ఇంద్రసేనారెడ్డి, ప్రతాప్‌రెడ్డి ఆయా గ్రామాల్లోని ప్రచారం చేశారు.

బ్రహ్మంగారిమఠం : 13న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై సోమవారం మధ్యాహ్నం 3గంటలకు బి.మఠంలో వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం ఉంటుందని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి హాజరవుతారన్నారు. జెడ్పీటీసీ, ఎంపిటీసీలు, సర్పంచ్‌లు, పట్టభద్రులు, నాయకులు హాజరుకావాలని తెలిపారు.

ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకుల్లో అగ్రగణ్యుడు రారా



రారా లేఖల సంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకుల్లో అగ్రగణ్యుడు రాచమల్లు రామచంద్రారెడ్డి అని ప్రముఖ కథా రచయిత కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి పేర్కొన్నారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఉన్న పుట్టపర్తి నారాయణాచార్యుల శాఖా గ్రంథాలయంలో శనివారం రాత్రి మిత్రజ్యోతి సాహితీ సాంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో రారా రాసిన లేఖల సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాహిత్యానికి కొత్త జవసత్వాలను చేర్చి కొత్త సంచలనాల వెంట పరుగెత్తించిన విమర్శకుడు రారా అన్నారు. విమర్శకుడిగానే కాకుండా ఆయన కల్పనా సాహిత్య కథలను రచించారన్నారు. కారల్ మార్క్స్ రచించిన కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికలను తెలుగులోకి అనువదించారని చెప్పారు. తెలుగు అధ్యాపకుడు హాజరతయ్యా మాట్లాడుతూ రారా జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఉన్నా ఆయన ఎక్కడా రాజీ లేకుండా బతికారన్నారు. కథారచయిత దాదా హయత్ మాట్లాడుతూ విమర్శకులుగా గుర్తింపు తెచ్చుకున్న రారా కథా సాహిత్యం ఎంతో శిల్పప్రమాణాలతో వస్తు నిష్ఠతతో ఉంటుందన్నారు. ఈ సభకు డాక్టర్ దస్తగిరి అధ్యక్షత వహించారు. మిత్ర జ్యోతి సభ్యుడు డాక్టర్ పవన్ కుమార్, జేవీవీ నాయకులు తవ్వా సురేష్, రాజేష్, రచయిత జింకా సుబ్రహ్మణ్యం, వరలక్ష్మి, మహమూద్, కాశీవరపు వెంకటసుబ్బయ్య, పల్లవోలు రమణ, సృజన శీను తదితరులు పాల్గొన్నారు

రిజిస్ట్రేషన్ లేని స్కానింగ్ సెంటర్లను సీజ్ చేస్తాం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ



స్కానింగ్ సెంటర్ నిర్వాహకులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ



ఆస్పత్రి డాక్టర్‌తో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసులు

ప్రొద్దుటూరు క్రైం : రిజిస్ట్రేషన్లు లేని స్కానింగ్ సెంటర్లను సీజ్ చేస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ హెచ్చరించారు. బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్కానింగ్ సెంటర్లను తనిఖీలు చేశారు. ఇందులో భాగంగానే డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో 9 బృందాలుగా ఏర్పడి ప్రొద్దుటూరులోని 34 స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం స్కానింగ్ చేయాలని ఆదేశించారు. స్కానింగ్ చేయించుకుంటున్న వారి వివరాలను తప్పకుండా ఆన్‌లైన్ చేయాలన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ వైద్యాధికారులు ఇళయరాణి, శివప్రసాద్ రెడ్డి, రాజేష్, నజీర్‌బాషా, మంజుల, చరిత, కరిష్మా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లను శనివారం వైద్యాధికారులు తనిఖీ చేశారు. శ్రీమదన్‌హాస్పిటల్, బీజీఆర్ హాస్పిటల్, సాయి డయాగ్నస్టిక్ సెంటర్ తదితర ఆస్పత్రులను డాక్టర్ శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని చెప్పారు. డబ్బులకు ఆశపడి పరీక్షలు చేసేవారిపై నిఘా పెట్టామన్నారు. అనంతరం స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రుల్లోని రికార్డులను పరిశీలించారు.

ఆడపిల్లలను సంరక్షిద్దాం

ప్రొద్దుటూరు క్రైం: ఆడపిల్లలను సంరక్షించడంతోపాటు చదివించాలని డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. సిర్డ్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక వైఎంఆర్ కాలనీలోని పురవీధుల్లో శనివారం బేటీ బచావో- బేటీ పడావో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం నేరమన్నారు. ఆడ పిల్లయినా, మగపిల్లాడైనా ఇద్దరూ సమానమే అని తెలిపారు. పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ వల్ల పడే శిక్షల గురించి డాక్టర్ అవగాహన కల్పించారు. సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంపీ సుబ్బారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

పాపిరెడ్డిపల్లెలో విద్యార్థుల ర్యాలీ

బ్రహ్మంగారిమఠం : మండలంలోని తోట్లపల్లె పంచాయతీ పాపిరెడ్డిపల్లెలో శనివారం పంచాయతీ ఆరోగ్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులచే గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.పుష్పరాజ్ మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షిద్దాం ఆడపిల్లలను చదివిద్దాం , ఆడపిల్లలను కాపాడుదాం, భ్రూణ హత్యలు నిర్మూలిద్దామన్నారు. ఆడపిల్లల చదువులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పెసల నారాయణ, హెల్త్ అసిస్టెంట్ మాధవ నాయుడు, సీహెచ్‌ఓ రమ్యకృష్ణ, ఏఎన్‌ఎం లలితమ్మ, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు బండిశ్రీనివాసరావు రాక

ప్రొద్దుటూరు క్రైం : ఏపీ ఎన్జీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు ఆదివారం ప్రొద్దుటూరుకు రానున్నట్లు ప్రొద్దుటూరు ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి తెలిపారు. ఆయనతోపాటు ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్, జిల్లా నాయకులు అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, రవికుమార్ వస్తారన్నారు. కొత్తగా మార్పు చేసిన అసోసియేషన్ కార్యాలయాన్ని రాష్ట్ర అధ్యక్షుడు ప్రారంభిస్తారని చెప్పారు. ఉద్యోగులందరూ ఉదయం 9 గంటలకు శివాలయం రోడ్డులోని శ్రీకృష్ణ ఆలయం వద్దకు రావాలని కోరారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని గీతాంజలి హైస్కూల్ కరస్పాండెంట్ శివరామి రెడ్డి పేర్కొన్నారు. స్థానిక గోల్డెన్ పార్క్‌లో శనివారం గీతాంజలి స్కూల్ 18వ వార్షిక వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలిచి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. చదువులో రాణించిన, వివిధ పోటీల్లో ప్రతిభ కనపరచిన చిన్నారులకు బహుమతులు అందచేశారు. ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీబీఐటీ కళాశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న కరస్పాండెంట్ వి.జయచంద్రారెడ్డి

చాపాడు : చైతన్యభారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం సాయంత్రం కళాశాల 15 వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ వి.జయచంద్రారెడ్డి మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం పంట పొలాల నడుమ గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ఇంజినీరింగ్ కళాశాలను నెలకొల్పామని, నేడు ఇంజినీరింగ్ కాలేజీతో పాటు పాలిటెక్నిక్ కళాశాల, ఇంటర్నేషన్ పబ్లిక్ స్కూల్‌లు కొనసాగుతున్నాయన్నారు. సీబీఐటీ ఆవరణాన్ని విద్యానగర్‌గా చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్యను తక్కువ ఫీజులతో అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పలు రకాల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీబీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ప్రతిభ చూపాలి

డీఈఓ దేవరాజ్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

రాజుపాళెం : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజ్ పేర్కొన్నారు. మండలంలోని టంగుటూరు, వెలవలి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శనివారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలల్లోని విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ పరీక్షలంటే భయాందోళన చెందవద్దని, ఇష్టపడి చదివి పరీక్షలు రాయలని తెలిపారు. ఎంఈఓ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి

రాజుపాళెం: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని ప్రొద్దుటూరు రూరల్ సీఐ మధుసూదన్ గౌడ్ పేర్కొన్నారు. రాజుపాళెంలోని సర్వజ్ఞ హైస్కూల్ వార్షికోత్సవాన్ని కరస్పాండెంట్ వెంకటశివారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ప్రముఖ డాక్టర్ స్వరూప్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఎంఈఓ వెంకటేశ్వర్లు, అవధాని నరాల రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం చదువులో రాణించిన విద్యార్థులకు మెడల్స్, మెమెంటోలను అందించారు.

వాడి వేడిగా మండల సమావేశం

సభ్యులకు సమాధానం ఇవ్వని రెవెన్యూ అధికారి



మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు చెన్ను రాజశేఖర్

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మండల సర్వసభ్య సమావేశం శనివారం వాడివేడిగా జరిగింది. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు చెన్ను రాజశేఖర్ అడిగిన ప్రశ్నలకు డిప్యూటీ తహసీల్దార్ సంజీవరెడ్డి సరైన సమాధానం ఇవ్వలేదు. శనివారం మండల ఉపాధ్యక్షుడి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రెవెన్యూ కార్యాలయ భవనానికి మరమ్మతుల కోసం వచ్చిన నిధుల గురించి, టెండర్ లేకుండా పనులు ఎలా చేస్తున్నారు? నామినేషన్ అయితే ఎవరు చేస్తున్నారు? ఎంత డబ్బు ఖర్చు చేస్తున్నారు? ఇలా పలు ప్రశ్నలు అడిగారు. సమావేశానికి హాజరయిన డిప్యూటీ తహసీల్దార్ సంజీవరెడ్డి రూ. 5 లక్షల నిధులు ఇస్తున్నట్లు చెప్పారు కానీ వచ్చింది రూ. 3 లక్షలే అని, తరువాత ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదు. ప్రభుత్వ కార్యాలయాన్ని ప్రభుత్వ నిధులతో మరమ్మతు చేయాలి.. కానీ ఇక్కడ దాతల ద్వారా డబ్బు, సామగ్రి వసూలు చేస్తున్నారు. అలా చేయవచ్చా? దాతల నుంచి వసూలు చేసినప్పుడు వారికి రసీదు ఇస్తున్నారా? ఎందుకు ఇవ్వడంలేదు? ఎంత వసూలు చేశారు? దేనికి... దేనికి వసూలు చేశారు? ఎంత ఖర్చు చేశారని చెన్ను రాజశేఖర్ ప్రశ్నించడంతో డిప్యూటీ తహసీల్దార్ సమాధానం చెప్పలేకపోయారు.

అదే సమయంలో రంగసముద్రం సర్పంచ్ రవి ప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ కల్వకూరు రమణ మాట్లాడుతూ ఇటీవల అక్రమ మట్టి తోలకం అంటూ వాహనాలు స్వాధీనం చేసుకున్నారని, వాటిపై కేసు నమోదు చేసి పోలీసులకు అప్పగించక మీ దగ్గరే పెట్టుకుంటే వాటికి రక్షణ ఎవరని అడిగారు. తప్పు చేసిన వారికి జరిమానా విధించి వదలాలి.. లేదా కేసు పెట్టాలి. కనీసం వాహన యజమానులకు నోటీసు ఇవ్వాలి. ఏదీ చేయకుండా ఉండటం సరైనదేనా? అని అడగ్గా డిప్యూటీ తహసీల్దార్ వారి ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదు. అలాగే టీచర్స్‌కాలనీలో పార్కుకు, వాటర్ ట్యాంకు తదితర అవసరాలకు కేటాయించిన ఖాళీస్థలం స్వాధీనం చేసుకోవడంపై వారు ప్రశ్నించారు. సమావేశంలో జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ మాట్లాడుతూ వేసవికాలం మొదలైందని, నీటి ఎద్దడి రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి రఘురామిరెడ్డి, హౌసింగ్ ఏఈ రమేష్ బాబు, పంచాయతీరాజ్ ఏఈ, డ్రింకింగ్ వాటర్ ఏఈ ఓబయ్య, ట్రాన్స్‌కో ఏఈ వెంకట మహేష్, ఉద్యానశాఖాధికారి శ్రీనివాసులరెడ్డి వారి శాఖల్లో నడుస్తున్న పనుల గురించి వివరించారు. వెటర్నరీ డాక్టర్ చెన్నారెడ్డి మాట్లాడుతూ గాలికుంటువ్యాధి నివారణకు మండలానికి 17150 డోసుల టీకాలు వచ్చాయన్నారు. నెల లోగా వాటిని వినియోగించాల్సి ఉందన్నారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, ఎంపీడీఓ నూర్జహాన్, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు సమావేశంలో పాల్గొన్నారు.